మాతృభాషను రక్షించుకోవాలి



అంతర్జాతీయ భాషా దినోత్సవంలో మాట్లాడుతున్న రచయిత్రీ నీహారిణి

ఘట్‌కేసర్: ప్రపంచంలో ఏ దేశమైనా వారి మాతృభాషను రక్షించుకోవాలని కవయిత్రీ డాక్టర్ కొండపల్లి నీహారిణి అన్నారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ భాషా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావాలు, అభిప్రాయాలను వెలిబుచ్చడానికి మాతృభాషను మించిన జ్ఞానం ఏ భాషలో లభించదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, డాక్టర్ పద్మావతి, పద్మమ్మ, శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన ఎంపీపీ



అవుషాపూర్ జెడ్పీ పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ జెడ్పీ పాఠశాలను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని, ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పోయాలని సిబ్బందిని ఆదేశించారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మేడ్చల్ రూరల్: సంకర జాతి పశువులకు తైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పూడూర్ పశువైద్యాధికారి కురుమూర్తి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలువురు పాడి రైతుల పశువులకు తైలేరియా నివారణ టీకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంకర జాతి పశువులలో వ్యాధి వచ్చి మరణించే ప్రమాదం ఉందని టీకా ఖచ్చితంగా వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ హేమంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది సుధ, శ్రీనివాస్,తిరుపతి,రైతులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌ను అభినందించిన డీజీపీ



మేడ్చల్: ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో విజేతగా నిలిచిన హెడ్ కానిస్టేబుల్ ను డీజీపీ రవిగుప్తా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర ప్రసాద్ డ్యూటీ మీట్‌లో ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా పతకం సాధించడంతో బుధవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవేంద్రప్రసాద్‌ను డీజీపీ రవిగుప్తా అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



కీసర: నాగారం మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన ఆగిరెడ్డికి మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి బుధవారం సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేశారు. అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆయనకు రూ. 90 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కరుణారెడ్డి, లబ్ధిదారుడు పాల్గొన్నారు.

నూతన సీఐని సత్కరించిన నేతలు



మేడ్చల్: బదిలీపై మేడ్చల్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీఐ సత్యనారయణను మేడ్చల్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి సత్కరించారు. లంబాడ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ధన్‌రాజ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు యూనుస్ పాషా, ఆటో యూనియన్ అధ్యక్షుడు విజయారావు తదితరులు సీఐ కలిసి శాలువాలతో సత్కరించారు.

కమిషనర్‌కు పాలకవర్గం సభ్యుల శుభాకాంక్షలు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నూతన కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డిని బుధవారం జవహర్‌నగర్ పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, శాంతికోటేష్‌గౌడ్, పానుగంటి బాబు, రాజ్‌కుమార్, సాయి, నవీన్‌కుమార్, నాయకులు మనోదర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్‌గౌడ్, కృష్ణ, సుబ్రమణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ ఏసీపీగా నరేష్‌రెడ్డి

కుషాయిగూడ: కుషాయిగూడ ఏసీపీగా పింగళి నరేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వర్తించిన రవీందర్ డీజీ కార్యాలయానికి వెళ్లగా హ్యూమన్ రైట్స్ కమిషన్ నుంచి నరేష్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్, పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024కు సంబంధించి డీఐవో కిషన్, డీఈవో విజయకుమారితోసహా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

పదో తరగతి పరీక్షలు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 47406 (రెగ్యులర్ 46834, ప్రైవేట్ 572) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలన్నారు.విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు,రాచకొండ,సైబ రాబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎంపీ ల్యాడ్స్ చేపట్టిన అభివృద్ధి పనులలో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాలులో ఎంపీ ల్యాడ్స్‌తోసహా సీడీపీ, సీబీఎఫ్, ఎస్‌డీఎఫ్‌లతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఎక్కడ కూడా పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయగలరని సూచించారు. ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టి అసంపూర్తి పనులన్నీ ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన యూటిలైజషన్ సర్టిఫికెట్‌లను సీపీఓకు పంపాలన్నారు.వచ్చే సమావేశం నాటికి అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్సిట్యూషన్సీ డెవలప్మెంట్ ఫండ్స్) , పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్), క్రుషియల్ బ్యాలెన్స్‌డ్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్)కు సంబంధించి జిల్లాలోని రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, అటవీ శాఖ , డీడబ్ల్యువో, డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతోసహా జిల్లా ప్రణాళికా అధికారి మోహన్‌రావు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి, ట్రాఫిక్ సీఐ రఘువీర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో వివిధ వార్డుల్లో మంచినీటి సమస్యకు శాశ్వత ప్రాతిపదికగా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని 7, 8 వ వార్డుల్లో కొత్తగా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ 7, 8 వ వార్డుల్లోని వెంకటాద్రి మరియు ఎస్వీనగర్ కాలనీలలో కొత్తగా జలమండలి ఆధ్వర్యంలో నిర్మాణం అవుతున్న మంచినీటి ట్యాంకుల పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. నాగారం ప్రధాన రహదారి గుండా కొత్తనిర్మించిన ట్యాంకులకు మెయిన్ పైప్‌లైన్‌పనులను చేపట్టాల్సి ఉందని ఈ పనులను కూడా గురువారం నుండి ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రఘువీర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జలమండలి అధికారులు నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

సీఎం చేతిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అక్రమాల చిట్టా

బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరంతోసహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాల చిట్టా అంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర ఉందని, వాటిని బయట పెట్టకుండా ఉండేందుకు నెల నెలా కప్పం కట్టి తీరాల్సిందేనని బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీజేపీ చేపడుతున్న ప్రజా సంకల్ప యాత్రపై బుధవారం పాత బోయిన్‌పల్లి, హస్మత్ పేటలోని అర్బన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌లో ఓడిస్తే మల్కాజిగిరి ప్రజలు రేవంత్ రెడ్డిని లోక్‌సభకు పంపారని హరీష్‌రెడ్డి తెలిపారు. ప్రశ్నించే గొంతుకనని ఎంపీగా గెలుపొందిన రేవంత్ రెడ్డి ఏనాడూ మల్కాజిగిరి సమస్యలపై పోరాటం చేసిందిలేదని విమర్శించారు. వ్యక్తి ప్రయోజనాల గురించి ఎంపీ పదవిని వాడుకున్నారన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లను కాంగ్రెస్ కోల్పోయిందన్నారు. ఈ లెక్కన వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కోల్పోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆర్‌ఎస్ పార్టీతో పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకో బోమని బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి అన్నారు.

24 నుంచి మల్కాజిగిరిలో విజయ సంకల్ప యాత్ర

ఈ నెల 24 నుంచి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎల్బీనగర్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్ర ప్రవేశిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్ గౌడ్ తెలిపారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్‌ల మీదుగా కూకట్‌పల్లిలో ముగుస్తుందని తెలిపారు. అలాగే, ఈ నెల 27వ తేదీన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో యాత్ర ఉంటుందని తెలిపారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీ ఫీడర్ లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు పలు కాలనీలలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీ, రాఘవేంద్రనగర్, కిష్టాపూర్ రోడ్డు, కేఎల్‌ఆర్,1,2,3 లలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని సింహాపు రికాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ గ్రాంట్లతోపాటు, మున్సిపల్ నిధులు వెచ్చించి వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు దివ్యదయాకర్‌రావు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో నేడే అవిశ్వాసం



కీసర: నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మెన్ బండారిమల్లేష్ యాదవ్‌లపై నేడు (గురువారం) అవిశ్వాస పరీక్ష సమావేశం జరుగనున్నది. నాగారం మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో సొంత పార్టీకిచెందిన 10 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతోపాటు, కాంగ్రెస్‌పార్టీకి చెందిన ముగ్గురుకౌన్సిలర్లు, బీజేపీకి చెందిన ఒక కౌన్సిలర్‌తో కలిపి మొత్తం 14 మంది కౌన్సిలర్లు ఫిబ్రవరి 5వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో అవిశ్వాసనోటీసును అందజేసిన విషయం తెలిసిందే. 14 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసుపై జిల్లాకలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు నేడు(గురువారం) నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి ప్రత్యేకాధికారి హోదాలో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

జాబ్‌పై ఆశతో రూ.1.26 లక్షలు పోయె..

నిందితుడిపై కేసు నమోదు

పోచారం: పార్ట్ టైం జాబ్‌తో ఎక్కువగా సంపాదించుకోవచ్చని చెప్పి మోసగించిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొర్రెముల గ్రామానికి చెందిన కొప్పుల అజయ్ కుమార్‌రెడ్డి(24)కి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. గూగుల్ మ్యాప్ రివ్యూయర్‌గా పార్ట్ టైం జాబ్ చేస్తే మంచి సంపాదన ఉంటుందని చెప్పడంతో జాబ్ చేయడానికి ఒప్పుకున్నాడు. మొదటి టాస్క్ పూర్తి చేసినందుకు రూ.200 వచ్చాయి. ఈ నెల 5న అజయ్‌కు టెలిగ్రామ్ లింక్ పంపాడు. ఈ లింక్‌లోని టాస్కలు అన్నీ పూర్తి చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని నమ్మించాడు. వీటిల్లో ఒక్కో టాస్కు పూర్తి చేయడానికి ఖర్చు అవుతుందని చెప్పడంతో అందుకు అజయ్ ఒప్పుకున్నాడు. విడతల వారీగా మొత్తం రూ.1,26,632 చెల్లించాడు. అయినప్పటికీ అతడికి తిరిగి ఏవిధమైన చెల్లింపులు రాకపోవడంతో తాను మోసపోయానని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

23వ వార్డులో పర్యటించిన కమిషనర్



రైతు బజారు వద్ద పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కౌన్సిలర్ కౌడె మహేష్‌తో కలిసి పర్యటించారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. వార్డులో అంగన్‌వాడీ కేంద్రం, వ్యాక్సిన్ సెంటర్ రైతు బజారు., పాత సివిల్ ఆసుపత్రి భవణం,ప్రాథమిక పాఠశాల తదితర వాటిని పరిశీలించారు. వార్డులో రూ34లక్షలతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు.

జంక్షన్.. జామ్ కాకుండా..

- ఉప్పల్‌లో జంక్షన్ల అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ కసరత్తు
- ఏడు కూడళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- ప్రతి కూడలి వద్ద 200 ఫీట్ల వరకు జంక్షన్లు



ఉప్పల్ ఏషియన్ థియేటర్ వద్ద కూడళ్లను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో ట్రాఫిక్ రద్దీని మరింత సమర్థవంతంగా తట్టుకునే విధంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రతి కూడలి వద్ద 200 ఫీట్ల వరకు జంక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. ఉప్పల్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌తో ప్రయాణికులు సతమతం అవుతున్నారు. ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్ పనులు కొనసాగుతున్నాయి. దీనికి తోడు ఉప్పల్ మెట్రో రైల్ ఇలా అనేక రకాలుగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా ట్రాఫిక్ రద్దీ పెరుగుతూనే ఉంది. దీంతో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లపై ట్రాఫిక్ భారం తీవ్రంగా పడుతోంది. దీంతో సగటు ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. దానికితోడు నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు నివేదికలు

ఉప్పల్ పేరు చెబితేనే.. వామ్మో.. ఉప్పల్ రోడ్లు అన్నట్లుగా భయాందోళనకు గురవుతున్నారు. ఉప్పల్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్లను అభివృద్ధి చేయాలని, తద్వార రానున్న రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొనే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు జంక్షన్ల అభివృద్ధికి కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉప్పల్ చౌరస్తా వద్ద ప్రస్తుతం 150 ఫీట్ల రోడ్డు ఉంది. దాన్ని 200 ఫీట్ల వరకు వెడల్పు చేసి జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే వీటి కమాన్ వద్ద కూడా ఇదే విధంగా, టయోటా షోరూం వద్ద, చిలుకానగర్ టీ జంక్షన్, రామంతాపూర్ శివాజీ విగ్రహం చౌరస్తా, రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, వేంకటేశ్వర టెంపుల్ కూడలి వద్ద ఇలా దాదాపు సర్కిల్ పరిధిలో ఏడు ప్రాంతాల్లో 200 ఫీట్ల జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. కాగా ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రైవేటు ప్రాపర్టీలను గుర్తించి ప్రభుత్వంతో పాటు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మొదటగా ఉప్పల్ ఏషియన్ థియేటర్ వద్ద జంక్షన్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మించనున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యానికి ఎంతో మేలు



శేఖర్‌గుప్తాను మెడల్స్‌తో సన్మానిస్తున్న ప్రభాకర్

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని ఆర్‌ఐ ఫిట్‌నెస్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బండారు ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ క్లబ్ రన్ ఆఫ్ మారతాన్ (పరుగు పందెం)లో చెంగిచర్లకు చెందిన కటకం శేఖర్‌గుప్తా దిగ్విజయంగా 21 కిలోమీటర్ల పరుగు పందెం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు మెడల్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా జీవించేందుకు వ్యాయామంతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఒత్తిడి తగ్గించుకుని, ఆరోగ్యవంతంగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కట్ట శేఖర్, మల్లేష్, నరసింహ, వెంకటరావు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆరగింపు సేవలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పలాచార్యులు, రాంప్రసాద్ ఆచార్యులు, వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి

బోడుప్పల్: బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.అక్షయ్‌కుమార్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి పొందారు. ఫిజికల్ సైన్స్ ఫోరం, తెలంగాణ బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నిర్వహించిన జిల్లా లెవెవల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బోడుప్పల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అక్షయ్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా సర్టిఫికేట్‌తో పాటు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రతిభ ఉన్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని, వారిని ఆయా రంగాల్లో రాణించే విధంగా తర్ఫీదు ఇస్తామన్నారు. చక్కటి వాతావరణంలో ఉత్తమ బోధన చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వనజ పాల్గొన్నారు.

జంతు జనన నియంత్రణకు బ్లూక్రాస్‌తో ఒప్పందం

మేడిపల్లి: జంతుజనన నియంత్రణ, వీధి కుక్కల కోసం యాంటీ రేబీస్ టీకాలు ఇచ్చే బ్లూక్రాస్ సంస్థతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం ఎంవోయూ చేసుకున్నట్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు తెలిపారు. బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధి కుమారి ఎంఓయూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వీధి కుక్కల బెడతకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గతంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్‌లో 50శాతం కుక్కలకు ఆపరేషన్లు జరిగాయని, మిగిలిన వాటికి కూడా పూర్తి చేయాలని అలాగే ఆపరేషన్లను చేసిన కుక్కలకు రేడియం ట్యాగ్ వేయాలని సూచించారు. ఇతర ప్రాంతాలు, మున్సిపాటీల నుంచి అక్రమంగా డంప్ అవుతున్న కుక్కలపై నిఘా పెంచాలని అధికారులు ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఆ ప్రాంతంలోని మొత్తం కుక్కలకు ఆపరేషన్లు చేసిన తర్వాతే మరో ప్రాంతంలోని కుక్కలకు ఆపరేషన్ చేయాలని మేయర్ సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యూపీహెచ్‌సీ, బస్తీ దవఖానాల్లో యాంటిరేబిస్ టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్లూక్రాస్ ప్రతినిధి కుమారి, నాయకులు బండి సతీష్‌గౌడ్, మేనేజర్ జ్యోతి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మురళి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.